

సినీ విశ్వరూప సందర్శనం

తెల తెల వారుతూఉండగా రాజుని ఎవరో గట్టిగా కుదిపిలేపి పదపదమని వంటగదిలోకి తీసుకెళ్ళారు. కలత నిద్రలో కంగారులో ఏం జరిగిందో తెలీక తెల్లబోతున్న రాజుకి "రాజా! నారాజా" అని ఓదారుస్తున్న వరసు ఆప్యాయమైన కంఠం, వెచ్చని స్పర్శ అనుభవానికి రావడంతో దుఃఖం పెల్లుబికి పోయింది. "బామ్మా యింటికొచ్చేస్తా" అని బావురుమన్నాడు.

లక్ష్మీన్నరసు అతని వీపుతట్టింది. జరిగింది మర్చిపొమ్మంది. గట్టిగా ఏడవకు బాబాయి లేస్తాడంది. ఆ సందర్భం పురస్కరించుకొని బాబాయిమీద పచ్చి తెలుగులో నిశిత విమర్శ చేసింది.

"ఇయ్యాల కొక్కరోజు — మాపిటేలదాకా యాడన్నా పల్లకుండా పడుండు. నేను ఈ యెదవ మాలోకంలోంచి వచ్చేత్తా. రేపు మనం తిరపతెల్లి మనువాడదారి. ఆనక కలో గంజో కాఫీయో టీయో తాగి బతుకుదారి. నీకు డబ్బు లేదుగందాని వదిలి పొయ్యేటంత యదవరకం కాదు నేను" అంది ఉద్వేగంతో.

రాజు పూర్తిగా మేలుకున్నాడు. అతనికింకా దిగులు కలిగింది.

"అయ్యో వద్దు నర్సూ నాలాంటి దిక్కులేనివానికై నీయొక్క డబ్బుగల బాబాయితో సంబంధాలు తెంచుకుని నాతో కలిసి అవస్థలుపడకు. ఇది సినిమా కాదు జీవితం. ఏ.వీ. యం. వారిదికాదు. నిజం జీవితం." అన్నాడు బాధగా.

నరసు అమాంతం అతన్ని కౌగలించుకు ముద్దుపెట్టుకుంది.

అంతవరకు పోర్షను లేనివాడిలా దిక్కులు చూస్తున్న రాయుడు తుళ్ళిపడ్డాడు. "వాటీజ్ దిస్ వార్నింగ్ లెస్ కిస్; ఇంకానయం పెన్సారు వాళ్ళు చూళ్ళేదు" అన్నాడు.

రాజు ఈ లోకంలో లేడు. డ్రీం సీక్వెన్సులో తిరుగుతున్నాడు.

అందుకని నరసు, రాయుడికే కర్తవ్యం ఉపదేశించింది. బాబాయి లేవకుండా బయటికి పొమ్మంది. గబగబ కాఫీ కాచి యిచ్చింది. ఐదు రూపాయలు రాజు జేబులో పెట్టింది.

"అల్లాల్లా తిరిగి సందేళకి మన పాతింటికిరా" అంది.

అంతలో రాయుడు హాల్లోకి వెళ్ళివచ్చి "సినిమా కెళ్తాం సినిమా కెళ్తాం" అన్నాడు. హాల్లో అతనిక్కీ సుబ్బన్నకి వచ్చిన ఇన్విటేషన్ కార్డులు రెండు దొరికాయి.

"ఏం పిక్చరు" అంది నరసు.

"యమ పిచ్చరులే. ఇంతవరకు యిట్లాంటిది రాలేదు" అన్నాడు రాయుడు.

అన్ని కాలాలకీ, అన్ని దేశాలకీ సరిపడే కథ అది. ఒక టమిల్ ఫోక్‌లోర్ హీరో ఒక తెలుగూ సోషల్ హీరోయిన్‌ని లవ్‌చేసి, కన్నడ పౌరాణిక విలన్‌తో పోరాడి రాక్ ఎండ్ రోల్ డాన్సు చేస్తాడు ఇందులో" అని ఆ పిక్చరు ప్రొడ్యూసర్లు డిస్టిబ్యూటర్లూ అనుకుంటూ ఉండగా రాయుడు విన్నాడు.

రాజుని వంటింట్లో దాచి, రాయుడు బజారుకెళ్ళి అరగంటలో షార్క్‌స్కిన్ శ్లాక్ షర్టులు రెండూ, గాబర్డిన్ లాగులు రెండూ అద్దెకి తెచ్చేశాడు.

రాజుకి అవి తొడిగి, నడవడం నేర్పి, పది నిమిషాలు పెరటి దోవన వీధిలోకి తీసుకొని వచ్చాడు.

తొణుకూ బెణుకూ లేకుండా ఆజ్ఞలు ఇస్తూఉన్న రాయుడు హఠాత్తుగా చాలా గొప్పవాడిలా కనిపించాడు రాజుకి. అతనిమీద చాలా గౌరవం నమ్మకం కలిగాయి.

"నువ్వు గొప్ప ప్రొడ్యూసరు అవుతావు" అని రాయుడు ధైర్యం చెబుతూఉంటే, మన సినిమాలలో చీకటిగా ఉండాల్సిన సీనులో వెలుగు కిరణాలలా నిరాశతో నిండాల్సిన అతని మనసులో చాలా ఆశలు మిల మిల్లాడాయి.

హోటలులో పూటుగా టిఫిను లగాయించి, ఆంధ్రాకిళ్ళీ బిగించి, బస్సెక్కేవరకూ రాయుడు దివ్యతేజంలో ధగధగ లాడిపోతున్నాడు. (ఏ డిస్ట్రిబ్యూటరు వల్లనో ముఠావల్లనో) అభిశప్తుడైన ఏ తెరవేలుపో, కాడిలాకియర్ కాబోయి మానేసి పదకొండో నెంబరు బస్సులో తిరుగు తున్నాడనుకున్నారు చూచినవారు.

ఫిలిం ఫీల్డుకే ప్రివ్యూ థియేటర్ అయిన పారగన్ సినిమాకి బస్ స్టాండునుండి ఉత్సాహంగా దూకుడుగా అంగలు వేస్తున్న రాయుడిని పలకరించడానికి కూడా గుండెలు చాలలేదు రాజుకి.

బారులు బారులుగా పోతున్న కారులలో జనం చాలామంది ఇతని కేసి చూసి చేయి ఊపుతున్నారు. కారు రిపేరులో ఉన్నందువల్ల షికారుగా నడుస్తున్నవాడిలా కనిపించాడు రాయుడు. వందనాలు అందుకొంటున్న కొద్దీ అతని తేజస్సు కొత్త స్టుడీబేకర్ దీపాలలా కళ్ళు మిరుమిట్లుగొలుపు తోంది. సినిమా మూడో రీలులో బాలనటి హఠాత్తుగా స్థూలనటి సైజుకి పెరిగినట్టు అతని ఒడ్డుపొడుగూకూడా పెరిగినట్టు కనిపించింది రాజుకి.

మరోవంక అతనికి కలల్లోమాత్రం పరిచయం ఉన్న హీరోలూ, హీరోయిన్‌లూ, విలన్‌లూ, కార్లలో దూసుకు వెళ్ళిపోతుంటే కళ్ళు తిరిగిపోతున్నాయి.

అల్లంతదూరాన సినిమా గేటుదగ్గిర చేరిన జనసమూహం చూసే సరికి ఇంకా తిరిగిపోయాయి. వాటికితోడు ఉదయపు ఎదురెండ, పొద్దుటి పెసరట్టులో నూనెపైత్యం కూడబలుక్కుని ప్రముఖపాత్ర నిర్వహించడంతో పైత్యం ఎక్కువై కళ్ళు బైర్లుగమ్మి సినిమాగేటుకి ఎదురువేపు రోడ్డు వారన కూలబడిపోయాడు రాజు.

రాయుడు ఈసారి కంగారు పడలేదు, రాత్రి అనుభవం వల్ల.

'లేవయ్యా. లే. ముందుకు రావలసిన వాడివి ఇలా అయితే ఎలా అన్నాడు, రాజుకి అడ్డు నిలబడి, కార్లవార్లకి కులాసాగా కనిపిస్తూ. ఐదు నిమిషాలయినా రాజు లేవలేదు. రాయుడు వెనక్కి తిరిగిచూస్తే ఏడుస్తున్నాడు. ముచ్చెమటలు పోసేశాయి. రెండు చేతులతోను కళ్ళు మూసేసుకున్నాడు.

"నేను రాలేను" అన్నాడు.

రాయుడు అతని జుట్టు నిమిరాడు వాత్సల్యంతో. "రాజా! ఎందుకీ విచారం....భయపడకండి లెండి. రండి. నేనున్నానుగా" అని అభయమిచ్చాడు.

రాజు దీనంగా చూశాడు రాయడివంక. తల అడ్డంగా తాటించాడు. "ఇందరు గొప్పవాళ్ళు—వణుకుతున్నాయి నాకాళ్ళు" అన్నాడు.

"మరేం ఫర్వాలేదు మీరూ గొప్పవారే. నేను చెప్పలా. మీ అంతట మీరే అనాలి. ఇంకో గంటలో అనేస్తారు. పదండి ఈలోగా జంకకండి. మిమ్మల్ని ఈ గొప్పవాళ్ళ మధ్యనించి నడిపి బాల్కనీ సోఫాలో కూలేసే పూచీ నాది. అంతవరకు మీరు నా డ్రైవింగులో వున్న కారు స్టీరింగులు అనుకోండి. లేదా నేను తొడుక్కున్న చొక్కాలు అనుకోండి. మిగతాదంతా నేను చూసుకుంటా మీరు కళ్ళుమూసుకు నడవండి. నడవడమే మీ పని. ఆపని చేసెయ్యండి. ఆనక ఏమవుతుందని బెంగవద్దు. అది నేను చూస్తాను. పదండి మీరు గొప్పవారు" అన్నాడు రాయుడు.

పెద్దమనిషి ఇన్నిసార్లు చెబుతున్నాడు గదా అని రాజు ఆమాట నమ్మేసి దానిమీద నిలబడ్డాడు మెల్లిగా. కాని హఠాత్తుగా మళ్ళీ దిగులు కమ్ముకొచ్చింది.

"గురో లాభంలేదు. నన్ను రమ్మనక. అంతమంది పెద్దవాళ్ళు దీన్నిండా వున్నారు. ఇది కళ. అదేమో మనదగ్గర లేదనుకో. నేను అన్‌ఫిట్. రాను. నేను రేపు గొప్ప ప్రొడ్యూసర్ని అయిపోతే ఇంకేమన్నా ఉందా? వీళ్ళు నాకన్నా చిన్నవాళ్ళయిపోరు? వీళ్ళందరికి నేను ఆగ్నలిచ్చి పనిచేయించాలి. భయపెట్టాలి. ఆర్టుకి సర్వీసు చేయించాలి. ఓరిబాబోయ్ నావల్లకాదు. చచ్చినా ఒప్పుకోను. నాకళ్ళు తిరిగిపోతున్నాయి బాబోయ్" అన్నాడు.

అని కళ్లు తెరిచేసరికి ఎదురుగా గేటుమీద 30 అడుగుల ఎత్తున నిలబడ్డ హీరోయిను బొమ్మ ఔట్ ఆఫ్ ఫోకస్‌లో కెళ్ళి మసకబారి మళ్ళీ మెల్లిగా రూపు దేలింది. కళామతల్లి రాజాకి కనిపించింది.

ఆమె సినీ — దేవతా వస్త్రాలు కట్టుకుంది. 'పుల్లద్రాక్ష' లు పొదిగిన కిరీటం ధరించింది. రెండు చేతుల్లో రెండు గిన్నెలున్నాయి. ఒక దానిమీద కళ అని రాసిఉంది. రెండో దానిమీద బాక్సాఫీస్ అని ఉంది. వాలఖిల్యుల పరిమాణంలో (అచ్చ తెలుగులో లిల్లిపుట్‌లన్నమాట) ఉన్న మనుషులు గిన్నెలచుట్టు సందడిగా తిరుగుతున్నారు. కొందరు కళ ఉన్న గిన్నెవేపు మరికొందరు బాక్సాఫీసు పాత్రవేపూ వెళ్తున్నారు. కొందరు కళవేపు పోతున్న వారిని బాక్సాఫీసు పగ్గాలతో వెనక్కి లాగుతున్నారు. కొందరు తొందరలో ఎవరికాలో తగిలి మూర్ఛపడుతున్నారు. బంతలాపడి ఉన్న కొందరు ఎవరికాలో తగిలి దిగ్గునలేచి పరుగెడుతున్నారు. నవ్వుతున్నారు. నవ్వుకుంటున్నారు. కొందరు పొట్టివాళ్ళు పొడుగువాళ్ళ మీదకి పొట్టివాళ్ళ నిచ్చెనలువేసి ఎక్కుతున్నారు. కొందరు పొట్టివాళ్లు పొడుగు నటిస్తున్నారు. వాళ్ళని చూసి ఎవరో చప్పట్లు కొడుతున్నారు. వాళ్ళని ఎవరో వెక్కిరిస్తున్నారు కొందరు అటువాళ్ళని ఇటులాగుతున్నారు. పునాదులులేని ఒక తెల్లగోడమీద గొలుసుల బొమ్మలు ఆడబోయిన బొమ్మల్ని చిటుకు చిటుకు కుడుతున్నాయి. కొన్నిటిని ముద్దెట్టుకొంటున్నాయి. కొన్నిటిని హైపోడెర్మిక్ సిరెంజి షాట్‌లు ఇచ్చి మత్తెక్కిస్తున్నాయి. బోలెడుజనం ఆగోడకేసి చూసి నవ్వుతున్నారు. వెక్కిరిస్తున్నారు. కొందరు అందుమీదకి ఎగబాక చూస్తున్నారు. కొందరు జారిపోతున్నారు. అందుకెవరో ఏడుస్తున్నారు. వాళ్ళనెవరో రూపాయ కిరాయకి ఓదారుస్తున్నారు. ఈ రహస్యాన్నెవరో అరుస్తున్నారు. వాళ్ళనెవరో కరుస్తున్నారు. ఎవరో కొందరికి పళ్లు మూస్తున్నారు. ఇంకొందరి కళ్లుమూస్తున్నారు. జీవితం ఆక్సిడైజ్ కావడానికి ఇంధనమైన ధనం మహాత్మ్యాన్ని తెలిపే ఉద్గ్రంథం చెక్కుబుక్కును శ్రద్ధగా చదువుకుంటున్న ఒక సినీమార్కు ద్రౌపది దరిజేరిన ఒక దుశ్శాసనుడు పైట దిగలాగేస్తున్నాడు; మరో చండశాసనుడు అది వల్లకాదని ఎగలాగుతున్నాడు. ఆవిడ ఇదేం పట్టించుకోకుండా బుద్ధిగా బుక్కు చదువుకుంటోంది.

ఈ సమ్మోహనకరమైన మనోహరమైన బీభత్సమైన భయంకరమైన చలచ్చిత్ర విశ్వరూపంచూసి దిగ్భ్రమచెంది, రెండు చేతులు పైకెత్తి

నమస్కారంపెట్టి, మైకంకమ్మి పడిపోతున్న రాజుని, రాయుడు పట్టు కున్నాడు. ఆ సన్నివేశానికి మంద్రస్వరంలో వ్యాఖ్యానించాడు రాయుడు.

"రాజా! అదే జనులపాలిట ఆకర్షణ, వికర్షణ, ఆనందదాయిని, అనారోగ్యకారిణి, జీవనప్రదాయిని, కళావని, రసధుని, ప్రకాశని, నాశని, శని, అని, ఖని అయిన చలనచిత్ర పరిశ్రమ విచిత్ర చిత్రం. దర్శించి తరించు. ఓ రాజా! ప్రపంచంలో అన్ని రంగాలలో ఉన్న చైతన్యం యావత్తు ఇక్కడ పుంజీభవించింది. జీవననాడి ఇక్కడ ఉధృతంగా స్పందిస్తుంది. ఇది ఒొత్తిగా కళాకాదు. ఉత్తి డబ్బుకాదు జీవితం .... దానికి బెల్జియం అద్దం.... పెద్ద అబద్ధం. గొప్ప నిజం. లక్షపొరలు కమ్మిన నిజం. లక్షరూపాలు ధరించగల జీవన ఖనిజం. వెలుగూ నీడ, నిజం అబద్ధం, దురాశా నిరాశా, డబ్బూ కళా, సోలో డూయెట్, లాంగ్‌షాట్ క్లోజప్, బుర్రా గర్రా, కామెడీ ట్రాజెడీ, ఫేడిన్ ఫేడౌట్, శాంతం కోపం, కృతజ్ఞత—ఘ్నత, స్తుతీ—నింద, కుడి ఎడమ, ఎక్జయట్ మెంటు, సెక్జ యట్ మెంటు, ప్రేమ ద్వేషం, నీతి నాతి, అచ్చులూ హల్లులూ 'అలా' 'వలా'—కలా ఇలా కళా తలా తిలా అన్నీ ఉంటాయి. శ్రీనివాసులూ శ్రీనివాసరావులూ సీక్కిినివాసమూర్తులూ, ఇంకా అనేక రకాల కచట తపలూ ఉంటారు. భూలోకంమీద మజిలీకొచ్చిన మానవుడు ఈ చాయలు కొస్తే మిగతా స్థలాలలోకన్న ఎక్కువ అవతారాలెత్తుతాడు. కష్ట సుఖా లతో, గుణావ గుణాలతో సంఘర్షణపడి అతడి హృదయం సానపట్టిన వజ్రం అవుతుంది. మనసు పక్వం అవుతుంది. జీవితం ఆరముగ్గుతుంది. ఇక్కడే జీవనరాగ సుధ రుచి తెలుస్తుంది, జీవనరాగం కనిపిస్తుంది, వినిపిస్తుంది. అనుభవానికి దొరుకుతుంది. మందగించిన చైతన్యానికి చైతన్యం అబ్బుతుంది. ఓ రాజా! ఇక భయపడకు. లే ముందడుగు వేసి మందిలోకి రా.... ఇంకో నిమిషం తరవాత వదిలి పొమ్మన్నా పోవు. నీలో భయం బయట పడడానికి భయపడుతుంది. సిగ్గు సిగ్గుపడుతుంది. ప్రతి పనికీ నువ్వు పనికిరావని సన్నాయి నొక్కులునొక్కే నీలోని సంకోచం సంకోచం చెందుతుంది. నీ ఆత్మవిశ్వాసం కాలరెత్తుకు బయిటికి వస్తుంది. ఈ తెరవేలుపుల స్వర్గసీమలో ప్రవేశించడానికి మార్గంలో

వాతావరణం ఎలాటిదో దాని ప్రభావం ఏమిటో తెలుసుకోడానికి నన్ను స్పుట్నిక్కుగా వాడుకో. నా వెనకాలేరా. షార్క్‌స్కిన్ చొక్కా గాబర్డిన్ లాగూ, రిస్టువాచీ ఉంగరం సర్దుకో. అవే ఈ వాతావరణం నీకు హాని చెయ్యకుండా రక్షించే కవచకుండలాలు. జేబులో పర్సే నీకు షాకు ఎబ్సార్బర్, లే. కాలరెత్తుకో మొహాన టెక్కు తగిలించుకుని టెక్కంగా ఎగరేయ్—చిన్నవాళ్లు ఎదురైతే హంగుచెయ్యి. పెద్దలయితే తగ్గిపోయి స్నేహం నటించు. పద. రాజా నీకు జయమగుగాక....బై ది బై గేటులో గూర్ఖావాడి దగ్గర జంకకేం?" అంటూ ముందడుగు వేశాడు రాయుడు.

పది నిముషాలలో ఇహలోకాన్ని మర్చిపోయాడు రాజు. ఇంకా సినిమా ఆరంభం కానందువల్ల పెందరాళే వచ్చిన పెద్దలంతా మేడమీద వరండాలో తిరుగుతున్నారు. చిరునవ్వు, సానుభూతి, గర్వం, కృతజ్ఞత, ప్రేమ, పరాకు, చిరాకూ పెదిమలమీద, కళ్ళక్రింద గీతలమీద, ముక్కుపుటాలమీద, మెడమీద, కళ్ళలోను, కనురెప్పలమీద, భ్రుకుటీమీదా తగిలించుకుని, ఒళ్ళంతా కళ్లున్న దేవరాజారావుల మల్లె తిరుగుతున్నారు జనం. అర్ధనారీశ్వరుడి వేషం కట్టే భాగవతుడి ముఖాన తెరలాగే వీళ్ళు సందర్భోచితంగా భావప్రకటన నిస్తున్నపుడు అన్యభావాలను దాచెయ్యడానికని దేవతావస్త్రాలతో నేసిన మేలితెరల పొరలు సిద్ధంగా ఉంచుకున్నారు. జీవిత నాటకంలో మహానటులను ఎన్నికచేసి సన్మానం చెయ్యాలనుకునే వాడిపని అసాధ్యం అనిపించేటంత మెలకువతో — క్షణంలో సగంలో మోస్తర్లు మార్చగల కెలడొస్కోపులో గాజుపూసల చైతన్యంతో హావభావాలను ఆవిష్కరిస్తున్నారు. తెరలు మరీ పల్చన అనిపించినపుడు కొన్ని భావాలను దాచటానికి భాషను ఉపయోగిస్తున్నారు. కొందరు అతిశయోక్తులలాంటి వస్త్రాలు ధరించారు. కొందరు వందిమాగధులను తొడుక్కున్నారు. కొందరు వినమ్రతని వల్లెవాటు వేసుకున్నారు. నాకసలు గర్వం లేదన్న గర్వంకొద్దీ కొందరు బనీను తొడుక్కువచ్చేసి వాటి చుట్టూరా "ఇక్కడ చొక్కా వుండాలి నిజానికి" అని సూచించే లైన్ స్కెచ్ తొడుక్కున్నారు.

అందులో ఈదుకుపోతూ ఉండగా రాజు హఠాత్తుగా తన భుజం చూసుకుని 'ఇదేమిటిది' అని అంతలోనే "అరే! ఎగిరిపోయిందే" అని ఆశ్చర్యపోయాడు.

"అవి చూపులు. అంతేలే. తూనీగల్లాంటివి. పూలవనంలో తుమ్మెదల్లాంటివి. బొమ్మల కొట్టులో పిల్లాడి లాంటివి. చీరల దుకాణంలో ఆడదానివంటివి. వంద సినిమాఛాన్సుల మధ్య వర్ధమాన నటుడి వంటివి. అవి ఎక్కడా నిలవలేవు" అన్నాడు రాయుడు మెల్లిగా నవ్వుతూ.

'చూడు రాజా చూడు. చూసి నేర్చుకో. రంగులు కలపడం, మార్చడం నేర్చుకో. పసుపుమీద నీలంవేస్తే ఆకుపచ్చ! నిజంమీద అబద్ధం చరిస్తే కల్చరు అవుతుంది. అదిగో ఆయన చూడు. ఆయనకి మన వెనకాయనంటే మంట. అయినా నవ్వుతున్నాడు, భక్తితో ....అసూయ మీద ప్రేమ అలికితే బిజినెస్....విను....ఈ పాతాయన ఆ కొత్తాయనని మెచ్చుకుంటున్నాడు. బాధకి చాలీచాలని ఠీవిని కప్పితే దైన్యం. ఎదటివాడి దైన్యంమీద హేళన ఒంపితే హైన్యం. విషాదంమీద చిరునవ్వు తెరవేస్తే కరుణ.

"విను....రాజా విను ...కబుర్లు విను. హలోసార్! మీ ట్యూనుని ....గారు కొట్టేసి వాడేసుకుంటున్నారు కేసు పెట్టరాదూ....ఈన కేసుపెట్టి రచ్చకెక్కిస్తే బొంబాయి వాడూ, వాడూ కేసువేస్తే హాలివుడ్ వాడూ కేసులు వేసెయ్యరూ?....

ఆయన ఒక పల్లవి కడితే అది పది పిల్లల్ని పెడుతుంది. హలో, నమస్తేసార్ మీ మాటే. మీపల్లవి మోతగా ఉందనీ .... నమస్కారమండోయ్ కులాసా? హి....హి....చూశ్శేదు .... గుడ్డీవె .... నమస్తే! ....మీమాటే! దయ లేదంటున్నాను. మూడు రోజుల్నుంచీ మిమ్మల్ని చూడాలని .... హలో! కులా .... "

రాయుడికి తెలిసినాయన కనిపించాడు. హలో అన్నాడు రాయుడు.

"ఏం బ్రదర్" అన్నాడు రాయడి నేస్తం ఇతని వంక చూడబోయి. కాని ఆ చూపు చూస్తూ వుండగానే రాయడు భుజంమీంచి ఎగిరి, వెనకాల వున్న ఇంకో పెద్దాయన కళ్ళమీద వాలింది. రాయడు తన నేస్తం కోసం చెయి జాచి ముందుకు వెళ్ళబోయాడు. నేస్తం నేరుగా వచ్చి ఇతన్ని ఢీకొని, సారీ అని, వెనకాయన దగ్గిరకి వెళ్ళబోయి, ఇంతలోకే ఆయన ఇంకెవరివేపో చూస్తూ హిప్నొటైజ్ అయి ఎటో పోతున్నందువల్ల వెనక్కి తిరిగి రాయుణ్ణి పలకరించబోయి, మానేసి, ఎవరో తారని చూసి నమస్కారం విసిరి, అది గమ్యస్థానం చేరకుండా మధ్యలో కింద పడినందువల్ల, దాన్ని తీసుకు దులిపి ఇంకెటో విసిరి........

*   *   *   *

రాజుగారూ మనం లోపలికి పోదాం పదండి సీట్లుండవు అన్నాడు రాయుడు.

"హల్లో రాజూ" అంటూ ఎవరో అడ్డుపడ్డారు.

తిథి మొదలైన ఆరునాటకాల రచయితా అయిన ముత్యం !

ఇద్దరూ గబగబా ఆశ్చర్యపోయాక ముత్యం తన సంగతి టూకీగా చెప్పాడు.

రాజు వెళ్ళిపోయాక అతనికేం తోచలేదు. పైగా రాజూ వాళ్ళ బామ్మ మంచంపట్టి చిక్కి సగమైపోయింది. ఉత్తరం రాయడానికి ఎడ్రసు తెలీదు. అందుకని ముత్యం తిన్నగా మెడ్రాస్ వచ్చేశాడు. టిక్కెట్టు తనొక్కడికే కొన్నా, అదృష్టం ఎలాగో అతనికూడా వచ్చేసింది. ఆవిడ సిఫార్సువల్ల, రాజుని వెదకడంలో తను కలుసుకున్న కొందరు తమిళ సినిమావాళ్ళు అతని ఆరు నాటకాలూ కొనేసి డబ్బులిచ్చారు. అన్నీ డబుల్ వర్షన్ పిక్చర్లే. తను ఇలా దారుణంగా గొప్పవాడై పోతూఉండగా నిన్న రాత్రి తన ప్రొడ్యూసరొకరు తనకి సుబ్బన్నని పరిచయం చేశారు. తను మామూలుగానే వరహాలరాజు సంగతి అడిగేసరికి "నాకు తెలుసు. వెధవ.

మోసగాడు. ఇప్పుడే పెళ్ళగొట్టాం" అన్నాడు సుబ్బన్నగారు. హారినీ! మూడు లక్షల రూపాయల ఆస్తిపరుడికి ఎంత అవమానం జరిగిందీ అన్నాడు తను. అంతే ఆ మాటతో సుబ్బన్నగారు మూర్ఛపోయారు. పొద్దున్న లేచిందగ్గిరనించీ వెతుకుతున్నారు. ఇందాకళే వాళ్ళమ్మాయి నరసు, రాజుకు హానిజరగదని ఒట్టు పెట్టించుకు చెప్పింది — ఇలా రాజూ రాయుడూ పారగన్‌లో ప్రెష్షోకెళ్ళారు అని అందరూ పరిగెత్తుకొచ్చారు అదీ కథ. ఇదిగో సుబ్బన్నగారు.

రాజు పక్కకి తిరిగి చూశాడు, సుబ్బన్నగారు కటుకూ కటుకూ నాలిక్కరిచేసుకుంటున్నాడు.

"నిన్ను అలా చేసినందుకు పశ్చాత్తాపం. ఒద్దన్నా మానటంలేదు నాలిక కరుచుకోడం" అన్నాడు సుబ్బన్నగారి వందిమాగధులు. అని సుబ్బన్న జెబ్బ పట్టుకున్నాడు లేపోతే ఆయన భోరున ఏడిచి రాజు కాళ్ళమీద పడిపోయేవాడే.